మూసీ పునరుజ్జీవం..హైదరాబాద్ శక్తివంతం

- లండన్ టూర్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- థేమ్స్ రివర్ పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీతో చర్చలు
- రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం కుదిరిన ఒప్పందం
- మరిన్ని దశల్లో చర్చలకు అంగీకారం


లండన్ అథారిటీ అధికారులతో చర్చలు జరుపుతున్న రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నదులు, సరస్సులు, సముద్ర తీరం వెంట ఉన్న నగరాలన్నీ చారిత్రాత్మకంగా అభివృద్ధి చెందాయి. హైదరాబాద్ సిటీకి ఆ ప్రత్యేకత ఉంది. అటు మూసీ నది వెంబడి, ఇటు హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్ లాంటి నదీ వ్యవస్థ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందింది. పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా తిరిగి మూసీకి పునర్వైభవం తీసుకొస్తే నదులు, సరస్సులతో హైదరాబాద్ మరింత శక్తివంతంగా తయారవుతుంది' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. మూసీ నది పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇతర దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి లండన్‌లో శుక్రవారం పర్యటించారు. థేమ్స్ నదిని సందర్శించారు. థేమ్స్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును సిఎం అడిగి తెలుసుకున్నారు. థేమ్స్ రివర్ పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ అధికారులు, నిపుణులతో దాదాపు మూడు గంటల పాటు సిఎం నేతృత్వంలోని బృందం చర్చలు జరిపింది. దశాబ్దాలుగా వివిధ దశల్లో థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన సమగ్రాభివృద్ధి కార్యక్రమాలను సిఎంకు అక్కడి కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ సియాన్ ఫోస్టర్, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్ కెహల్ లీవ్ వివరించారు. అందులో భాగంగా ఎదురైన సవాళ్లు, పరిష్కారాలు, ఖర్చయిన నిధులు, భాగస్వామ్యమైన సంస్థలు, అందంగా తీర్చిదిద్దేందుకు అనుసరించిన అత్యుత్తమ విధానాలన్నీ ఈ సందర్భంగా చర్చించారు. తన విజన్ 2050కు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ అధికారులు సానుకూలంగా చర్చలు జరిపారు. నదీ ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చినట్లు అక్కడి అధికారులు వివరించారు. నదీ జలాలను సుస్థిరంగా ఉంచడం, ఎంచుకున్న ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనమందించే రెవెన్యూ మోడల్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టును మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దే కొత్త విధానాలు ఎప్పటికప్పుడు గమనించడంతో పాటు, ప్రాజెక్టు నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్‌లో మూసీ నదిని పునరుజ్జీవింపజేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హామీ ఇచ్చింది. ఇదే సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, వివిధ సంస్థల భాగస్వామ్యంపైనా చర్చించారు. ఈ ప్రాజెక్టుకు నిర్దిష్టమైన సహకారం అందించేందుకు భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపాలని ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరింది. సిఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, సిఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండిఎ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి అమ్రపాలీ, ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రమోషన్స్ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకట రమణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఒవైసితో కలిసి లండన్ షార్డ్‌ను సందర్శించిన రేవంత్‌రెడ్డి

ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసితో కలిసి లండన్ షార్డ్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. లండన్ అర్బన్ లేఔట్, అభివృద్ధిని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. 72 అంతస్తుల పైభాగం నుంచి 309 మీటర్ల పొడవున్న థేమ్స్ నది లండన్ ఉత్తర వైపున్న ప్రాచీన నగరాన్ని పశ్చిమ భాగంలో ఉన్న ఆధునిక లండన్‌ను ఎలా కలుపుతుందో పరిశీలించారు.

త్వరలో అందరినీ కలుస్తా

- మంచి వైద్యం అందుతుంది
- వెంకట్‌తో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను శుక్రవారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, తమ్మినేని కుమారుడు సంఘమిత్ర పరామర్శించారు. ఈ సందర్భంగా తమ్మినేని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగానే ఉందని తమ్మినేని మాట్లాడారంటూ బి.వెంకట్ చెప్పారు. ఎఐజి ఆస్పత్రిలో మంచి వైద్యం అందుతోందని,త్వరలో అందరినీ కలుస్తానని అన్నారు. ఆరోగ్యం కుదట పడుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదనే విషయాన్ని ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయమన్నారని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాల గురించి ప్రస్తావించారని అన్నారు. పార్టీ శ్రేణులు ఎలా ఉన్నారంటూ తమ్మినేని అడిగారని గుర్తు చేశారు. ఎవరు ఆస్పత్రి రావొద్దని పార్టీ శ్రేణులకు వెంకట్ విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మీడియాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. తమ్మినేని ఆరోగ్యం మెరుగుపడుతోందని చెప్పారు. పరామర్శకు వెళ్లిన వారితో మాట్లాడుతున్నారని వివరించారు. బిపి సాధారణస్థితిలో ఉందని, క్రియాటిన్ గతం కంటే తగ్గిందని అన్నారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సందర్శకులు ఎక్కువగా వస్తే ఇబ్బంది కలుగుతుందని డాక్టర్లు చెప్తున్నారని, ఆస్పత్రికి ఎవరూ రావొద్దని కోరారు. కొద్దిరోజుల్లోనే ఆస్పత్రి నుంచి బయటికొస్తారని, అందరినీ కలుస్తారని, ప్రజా జీవితంలో, రాజకీయ జీవితంలో యథావిధిగా ఉంటారని చెప్పారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ నాయకులు

ఆటోడ్రైవర్లకు రూ.4,500 భృతి ఇవ్వాలి

- రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.4500 భృతిని ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌బాబు డిమాండ్ చేశారు. రవాణా రంగంలోని కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ మేరకు వారు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది కార్మికులు రవాణా రంగం మీద ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్నారనీ, వారిలో ఎక్కువ శాతం మంది చదువుకున్న యువకులు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో లోన్ల ద్వారా వాహనాలు కొనుక్కుని ట్రాన్స్‌పోర్టు రంగంలోకి వస్తున్నారని తెలిపారు. వారిపై ట్రాఫిక్ పోలీస్, రవాణా శాఖ అధికారులు విపరీతమైన పెనాల్టీలు వేస్తున్నారని వాపోయారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అదే సందర్భంలో ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్యాన్ని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మూడు నెలల పాటు ఆటోల ఈఎంఐలపై మారటోరియం విధించాలని కోరారు. కేరళ తరహాలో రాష్ట్ర ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్ ఏర్పాటు చేసి తక్కువ కమిషన్‌తో కార్మికులకు ఉపయోగపడే విధంగా తీసుకురావాలని సూచించారు. ఎంవి యాక్టు 2019 సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దనీ, కేంద్రం ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయాలని కోరారు.

దావోస్‌లో రూ. 40 వేల కోట్ల ఒప్పందాలు

- ఓర్వలేక విమర్శలు చేస్తున్న బిఆర్ఎస్ నేతలు
- ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ అనంతుల శ్యామ్‌మోహన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దావోస్ వేదికగా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చిన సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ అనంతుల శ్యామ్‌మోహన్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ మేధావుల ఫోరం నేతలు కమలాకర్‌రావు, పాపిరెడ్డి, డాక్టర్ గౌతమ్ ఆకునూరి, జనార్ధన్‌రెడ్డి, రామారావుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిఎం దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. టాటా గ్రూప్‌తో ఒప్పందం వల్ల వేలాది ఉద్యోగాలలు వస్తాయని తెలిపారు. ఎమ్మెల్సీలుగా ఎన్నికకానున్న టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బల్మూరి వెంకట్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు మొదటి నుంచి రేసులో ఉన్నా కొన్ని సమీకరణాలతో మర్చారని వివరించారు. ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం మంచి పదవి ఇస్తుందంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కల్పనలో బిఆర్ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రెండువేల ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తు చేశారు. తమ ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తిగా నమ్ముతున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. దాని వల్ల తెలంగాణ అన్ని రంగాల్లోనూ ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనవసర ప్రకటనతో దిగజారిపోతారు : విహెచ్

కాంగ్రెస్ పార్టీపై అనవసర ప్రకటనలు చేస్తే దిగజారి పోతారని మాజీ ఎంపి వి హనుమంతరావు బిఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనపై మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడిన తీరు బాగాలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసమే సిఎం రేవంత్ దావోస్ వెళ్లారని చెప్పారు. పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించి ఏం చేశారని బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పది రోజులూ ఓపిక పెట్టకపోతే ఎలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. భూ సమస్యలపై కమిటీని వేశామని, వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కన్‌స్ట్రక్షన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వం పేపర్లలో ఫోటోలు, టివిల్లో స్టేట్మెంట్లు తప్పితే ఎక్కడా నిజాల్ని వెల్లడించలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం న్యాక్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి పాల్గొన్న మంత్రి, బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడా చట్టబద్ధమైన పాలన సాగలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం తెలంగాణ నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసి లక్షల మంది యువత జీవితాలతో ఆడుకుందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు పెట్టుబడుల పేరిట మీడియా ప్రచారం తప్ప, ఒక్కటీ కార్యరూపం దాల్చలేదన్నారు. దుబాయ్‌కు చెందిన నాఫ్కో కంపెనీ న్యాక్‌తో ఒప్పందం చేసుకొని ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేస్తుందని చెప్పి ప్రచారం చేసుకున్నారని, తీరా చూస్తే అసలు ఆ కంపెనీ ఊసేలేదని న్యాక్ సిబ్బంది చెప్పడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. ప్రతి సంవత్సరం కనీసం నాలుగుసార్లు జరపాల్సిన న్యాక్ గవర్నింగ్ బాడీ సమావేశాల్ని పది సంవత్సరాల్లో కేవలం ఒక్కసారి మాత్రమే జరపడం అత్యంత బాధాకరం అన్నారు. రాబోయే రోజుల్లో తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో, మండలాల వారిగా నిరుద్యోగులకి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి.. ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. న్యాక్‌కు సంబంధించిన భూము ల్ని పొందిన కొన్ని సంస్థలు పూర్తిగా వ్యాపార కార్యకలపాలకు వినియోగిస్తూ న్యాక్ ఆదాయానికి పెద్దఎత్తున్న గండికొడుతున్నాయని, వాటిని సరిచేస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో కనస్ట్రక్షన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం, జిల్లాల్లో స్కిల్ సెంటర్లు నెలకొల్పడం, న్యాక్ భూముల్ని కాపాడటం, నిరుద్యోగులకు ఉపాధికల్పనకు నిర్వహించాల్సిన కోర్సుల గురించి విస్తృతంగా చర్చించారు.


ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి

డైరీల ఆవిష్కరణ

న్యాక్‌సముదాయంలోని బిల్డర్స్ అసోసియేషన్‌తో పాటు అర్అండ్‌బీ ఇంజనీర్ల డైరీలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇఎన్‌సిలు గణపతిరెడ్డి, రవీందర్ రావు పాల్గొన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దేవేందం రెడ్డి పది సంవత్సరాలు పోరాడిన కానీ తీరని కాంట్రాక్టర్ల సమస్యను కేవలం 48 గంటల్లో జిఒ ఆర్‌డి నెంబర్ 25 ద్వారా వచ్చేలా చేసి బిల్డర్ల సమస్యలను పరిష్కరించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ల రాష్ట్ర అధ్యక్షులు బాలాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు.

ఎక్కడివారు అక్కడే..

- ప్రభుత్వ శాఖల్లో డిప్యుటేషన్లన్నీ రద్దు
- త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే ఉద్యోగులు విధులు నిర్వహించాలి. ఎన్నో ఏళ్లుగా ఇతర శాఖల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు మాతృ శాఖలకు వెళ్లాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యుటేషన్లపై ప్రధానంగా దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో అప్పడి ప్రభుత్వ పెద్దల అడుగులకు మడుగులొత్తిన అధికారులను మార్చాల్సిందే నని సిఎస్‌కు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. గత నెలరోజుల వ్యవధిలో ఆదిశగా ప్రభుత్వం పలు నిర్ణయాలు కూడా తీసుకుంది. విపత్తుల వంటి అత్యవసర సమయాల్లో మినహా మిగిలిన రోజుల్లో డిప్యుటేషన్లకు అనుమతించరాదని, ఏ శాఖ అధికారులు ఆ శాఖలోనే విధులు నిర్వర్తించేలా త్వరలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేయనుంది. ఇప్పటికే ఆయా శాఖలు సిఎస్ కార్యాలయానికి పూర్తి వివరాలు అందేశారు.

రవాణా తదితర శాఖల్లో అదనపు విధులు-బాధ్యతల విధానాన్ని రద్దు చేసినట్లుగానే... అన్ని శాఖల్లో డిప్యుటేషన్ల రద్దుపై ఈ నెలలోనే ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది. సిఎం విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వేయి మందికి పైగా అధికారులు అయిదేళ్లకు మించి డిప్యుటేషన్‌లో కొనసాగుతున్నారు.

ప్రస్తుతం అన్ని శాఖల్లో కలిపి నాలుగు వేల మంది అధికారులు, 14 వేల మందికి పైగా ఉద్యోగులు డిప్యుటేషన్లపై ఉన్నారు. హైదరాబాద్ కేంద్రంగానే దాదాపు ఎనిమిది వేల మంది వివిధ హోదాల్లో ఇలా పనిచేస్తున్నారు. మంత్రులు, ఉన్నతాధికారుల వద్ద ప్రత్యేకాధికారులు, వ్యక్తిగత కార్యదర్శులు, వ్యక్తిగత సహాయకుల్లో 70 శాతం మంది డిప్యుటేషన్లపై ఉన్నవారే కావడం గమనార్హం. అన్నింటికంట ఎక్కువగా విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇతర శాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అలానే సహకార శాఖలోని అధికారుల్లో ఎక్కువ మంది ఇతర శాఖల్లో ఉన్నారు. పురపాలక శాఖలోని ఉద్యోగుల్లో పదిశాతానికి పైగా ఇతర శాఖల నుంచి వచ్చిన వారే ఉన్నారు. పశుసంవర్ధక, వ్యవసాయ శాఖల నుంచి దాదాపు వేయి మందికి పైగా ఉద్యోగులు ఇతర శాఖల్లో ఉన్నారు.

రెవెన్యూ, పరిశ్రమలు, రవాణా, ఐటి, నీటిపారుదల, పంచాయతీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యపన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, పర్యాటక, పౌరసరఫరాల శాఖల్లోనూ భారీఎత్తున డిప్యుటేషన్లపై వచ్చిన ఉద్యోగులున్నారు. పోలీసు శాఖ నుంచి భద్రతపరమైన విధులకే గాక ఇతర విధుల కోసమూ సిబ్బంది డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.

ఇళ్ల స్థలాలను పునరుద్ధరించాలి

గృహనిర్మాణ, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటికి వ్యకాస వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం జంగంపల్లి లో గతంలో కొనుగోలు చేసిన 12 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాలివ్వడంకోసం తిరిగి పునరుద్ధరించా లని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కొత్త నర్సింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో ఈ మేరకు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశంలో హయాంలో కొనుగోలు చేసిన సర్వే నెంబర్ 985, 990, 991లోని భూమిని 2008లో అప్పటి మంత్రి షబ్బీర్ అలీ ఇళ్ల స్థలాల కోసం పేదలకు పంచిన విషయాన్ని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందనీ, విడిసి పేరుతో అరాచకం సృష్టించిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విడిసి ముసుగులో అక్కడ ఉంటున్న పేదల గుడిసెలను తగులబెట్టారనీ, ఆ భూమిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూశారని వివరించారు. 132 మంది లబ్ధిదారులకు హైకోర్టు అనుకూలంగా ఉంటున్న పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనీ, కరెంటు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో పట్టాలిచ్చిన పేదలందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేగంగా కొనసాగుతున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.720 కోట్ల వ్యయంతో 36 నెలల్లో పూర్తి చేయడానికి మెసర్స్ గిర్ధారిలాల్ కన్‌స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్‌కు ఇపిసి విధానంలో నిర్మించేందుకు పనులు కేటాయించబడిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తయ్యేలా ప్రస్తుత స్టేషన్ భవనానికి రెండు వైపులా పనులు ప్రారంభించారు. నిర్మాణ కార్యకలాపాలను సులభతరం చేయడానికి తాత్కాలిక బుకింగ్ కార్యాలయం నిర్మించారు. అదే విధంగా కొత్త ఆర్‌పిఎఫ్ భవనం పనులు పూర్తి చేశారు. బేస్‌మెంట్-1 స్లాబ్ పనులు 80 శాతం, బేస్‌మెంట్-2 స్లాబ్ పనులు 60 శాతం పూర్తయ్యాయి. దాదాపు 200 కార్లు బేస్‌మెంట్-2 లో పార్కింగ్ చేసుకొనే సామర్థ్యం కలిగి ఉంది.



గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కోర్సులను24న కౌన్సిలింగ్

- ఎంసెట్-2023 అర్హత తప్పనిసరి
- ఎంజెపి కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీలోని వనపర్తి, కరీంనగర్ అగ్రికల్చర్ మహిళా కాలేజీల్లో బిఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24న రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. ఎంసెట్-2023లో ఉత్తీర్ణత సాధించిన వారు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. ఎంసెట్‌లో వచ్చిన ర్యాంక్‌తో పాటు గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజ్ సీట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారే ఈ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. కౌన్సిలింగ్ వివరాలు, ఖాళీ సీట్ల సంఖ్యకేటగిరీల వారీగా వెబ్‌సైట్ (https:// mjptbcwreis.telangana.gov.in)లో ఇచ్చామనీ, దరఖాస్తు చేసుకున్న అమ్మాయిలు పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు. వెబ్‌సైట్‌లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని డాక్టర్ మల్లయ్య బట్టు సూచించారు.

పర్యాటకశాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- మంత్రి జూపల్లికి చాడ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యాటక శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టు ఉద్యోగుల విషయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మంత్రి సమాధానమిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వివిఎస్ బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, నాయకులు జ్యోతి, రచన, హైమావతి, ఉడుత రమేష్, నాజర్వల్లి, రంజిత్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయండి : మంత్రి ఉత్తమ్‌కు చాడ లేఖ

శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్, కెనాల్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు సరిపడ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు.

సీతారామ ప్రాజెక్టు ఓ భారీ కుంభకోణం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ
- కెఆర్‌ఎంబికి ప్రాజెక్టుల అప్పగింత నిజం కాదని వ్యాఖ్య
- కెసిఆర్ పాలనలో దోపిడీ : భట్టి


సమీక్షలో చర్చిస్తున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పరిపాలనలో ప్రజాధనం దుర్వినియోగ మైందని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. కెఆర్‌ఎంబికి ప్రాజెక్టులను అప్పగించడానికి ప్రభుత్వం అంగీకరించలేదని వ్యాఖ్యా నించారు. కెసిఆర్ పదేళ్ల కాలంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కోసం ఫార్మాట్‌లో దరఖాస్తు చేయలేదని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సచివాలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి సమీక్ష చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ' రాష్ట్రంలోని ఒక్కోక్క ప్రాజెక్టుపై సమీక్ష చేస్తున్నాం. ఇందులో భాగంగా శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ, ఇతర సాగునీటి ప్రాజెక్టు పనుల వేగవంతంపై చర్చించాం. అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల్లో జరిగినట్టుగానే ఇందులో భారీ కుంభకోణం జరిగింది. ప్రాజెక్టుల పేరిట భారీ మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగమైంది. ఈ ప్రాజెక్టు గతంలో రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ అని రెండు వేర్వేరుగా ఉండేవి. ఆ రెండింటిని ఏ విధంగా ఒక్కటి చేసి సీతారామ ప్రాజెక్టుగా తీర్చిదిద్దారో తెలియడం లేదు. దీనిపై రూ. వేల కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో సిఎంగా ఉన్న కెసిఆర్ సైతం సీతారామ ప్రాజెక్టుపై అసెంబ్లీలో అబద్దాలు చెప్పారు. 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.1400 కోట్ల నుంచి రూ.1500 కోట్లు ఖర్చు చేసి ఉంటే దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు పూర్తయ్యేవి. 3.32 లక్షల ఎకరాలకు నీరు వచ్చేది. పదేళ్లు దాటింది. మరో రూ.7500 ఖర్చుచేశారు. ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదు. సీతారామ ప్రాజెక్టు వ్యయం పెంచి రూ. 18 వేలకోట్లకు తీసుకొచ్చారు' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కృష్ణా జలాల గురించి బిఆర్ఎస్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. ఏ ప్రాజెక్టు చూసినా పైసల కోసమే తప్ప, నీళ్ల కోసం కాదని విమర్శించారు. నిబంధనలు పాటించని అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. జాతీయ హోదా అనేది దేశంలో ఎక్కడా ఇవ్వలేదని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాతో చెప్పారని అన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుందే నీటికోసమని అన్నారు. 'ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి డిజైన్ చేసిన రాజీవ్‌సాగర్ ప్రాజెక్టు వ్యయం రూ.1681 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటికే రూ.889 కోట్లు ఖర్చుచేశారు. ఇందిరాసాగర్ మొత్తం వ్యయం రూ.1824 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో దీనిపై ఖర్చు చేసింది రూ.1064 కోట్లు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు ఇంకా ఖర్చు చేయాల్సింది కేవలం రూ.12 కోట్లు మాత్రమే. ఇది పట్టించుకోకుండా రీడిజైన్ పేరుతో కొత్తవి తీసుకొచ్చారు. దీనికి అదనంగా సీతమ్మసాగర్ బ్యారేజీ అని ప్రారంభించారు. దాని వ్యయం రూ.4481 కోట్లు. అంటే కేవలం రూ.1581 కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టుల వ్యయాన్ని రూ.22,981 కోట్లకు పెంచారు. వీటి కోసం టన్నెల్ అన్నారు. దాని పరిస్థితి ఏంటో తెలియడం లేదు. ఇంత దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజల సహకారం కావాలి' అని అభిప్రాయపడ్డారు.

ద్విచక్ర వాహన బీమా జారీలో 65% వృద్ధి : ఫోన్ పే

హైదరాబాద్ : గడిచిన రెండేళ్లలో ద్విచక్ర వాహన డిజిటల్ బీమా జారీలో 65 శాతం పైగా వృద్ధిని నమోదు చేసినట్లు ప్రకటించింది. బీమా పరిశ్రమ ఎదుగుదలతో పాటు, వినియోగదారుల్లో విశ్వాసం పెరగడం వల్ల డిజిటల్ ఛానెల్స్ ద్వారా ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొంది. 2021 సెప్టెంబర్ నుండి తన వేదికలో మొత్తం 90 లక్షలకు పైగా పాలసీలను, గత సంవత్సరంలోనే 40 లక్షలకు పైగా పాలసీలను విక్రయించినట్లు పేర్కొంది.

వివిఎల్‌సిసి నుంచి సీరమ్ ఫేస్ వాష్ శ్రేణీ

హైదరాబాద్ : ప్రముఖ బ్యూటీ అండ్ వెల్నెస్ ఉత్పత్తుల కంపెనీ వివిఎల్‌సిసి కొత్తగా సాలిసిలిక్ యాసిడ్ సీరమ్, విటమిన్ సి సీరమ్, హైలురోనిక్ యాసిడ్



సీరముతో ఆధారితమైన ఎనిమిది ప్రత్యేక వేరియంట్లలో సీరమ్ ముఖ శుభ్రత (ఫేస్ వాష్) శ్రేణీని విడుదల చేసింది. "మేము ఇటీవల ప్రారంభించిన సంచలనాత్మక శ్రేణీలో ఆవిష్కరణ పట్ల మా నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. ఇది చర్మ సంరక్షణ దినచర్యలను సులభతరం చేయడం, వ్యక్తులు చర్మ సంరక్షణకు దోహదం చేయనుంది." అని వివిఎల్‌సిసి సిఇఒ వికాస్ గుప్తా పేర్కొన్నారు.

ఎస్‌ఎంసిల ఎన్నికలు

- రాష్ట్రంలో 28,514 స్కూల్స్
- నేడు నోటిఫికేషన్.. ఈ నెల 29న ఎన్నికలు
- 1-8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు
- రేపటి నుంచే తల్లిదండ్రుల ఓటరు జాబితాల ప్రదర్శన
- 2019 నవంబర్ 30 జరిగిన ఎన్నికలు
- రెండేళ్లుగా లోపించిన పర్యవేక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేరెంట్స్, విద్యావంతుల భాగస్వామ్యంతో ప్రభుత్వం పాఠశాలల్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్కూల్ యాజమాన్య కమిటీలను (ఎస్‌ఎంసి) ఏర్పాటు చేశారు. ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. 2019 నవంబర్ 30న ఎస్‌ఎంసిలకు ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత రెండేళ్ల గడువు పూర్తయినా సరే ఎన్నికలు జరపలేదు. రెండేళ్లుగా ఎస్‌ఎంసిల పదవీ కాలం గడువును పెంచుతూ వచ్చారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరిపేందుకు సిద్ధమైంది. ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసి ఎన్నికలు జరిపేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ స్కూల్స్, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్, సాధారణ ప్రభుత్వ స్కూల్స్‌తో పాటు గురుకులాల్లోనూ ఎస్‌ఎంసిలను ఎన్నుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 28,514 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటన్నింటికీ ఎన్నికలు జరపాల్సి ఉంది. 2009 విద్యా హక్కు చట్టంలో సూచించినట్టుగా ప్రతినిధులు, తల్లిదండ్రులు, సంరక్షకులతో స్కూల్ యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయాలి. ఎస్‌ఎంసి కమిటీల్లో నాలుగింట మూడో వంతు తల్లిదండ్రులుంటారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సామాజిక తరగతులకు చెందిన ప్రతినిధులతో పాటు మహిళలకు కమిటీల్లో ప్రాధాన్యత కల్పించాలి. ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు జరపాలి. చేతులెత్తి లేదంటే ఓటింగ్ రూపంలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల ద్వారా ఎన్నుకోబడిన ఎస్‌ఎంసిలు ఆ పాఠశాలల పనితీరును పర్యవేక్షించాలి. పాఠశాల అభివృద్ధి, నిర్వహణ, విద్యా బోధన, ఉత్తీర్ణతకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి సిఫార్సు చేయాలి. వాటి అమలు కోసం కృషి చేయాలి. ప్రభుత్వాల ద్వారా, స్థానిక అధికారం ద్వారా సమకూరే నిధుల్ని పాఠశాల అభివృద్ధి, అవసరాల కోసం సక్రమంగా మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చు చేసేలా పర్యవేక్షించాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తుల వంటి వాటిని కూడా ఎస్‌ఎంసిలు పర్యవేక్షించి నాణ్యత ఉండేలా చూడాలి. రాజకీయాలకు అతీతంగా ఎస్‌ఎంసిలు పనిచేయడం ద్వారా ఆ పాఠశాల ఉన్నత ప్రమాణాలతో ముందుకెళ్తుంది.

29న ఎస్‌ఎంసీలకు ఎన్నికలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 29న స్కూల్ యాజమాన్య కమిటీల ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం 33 జిల్లాల్లోని విద్యా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆయా జిల్లాల్లో ఉన్న స్కూళ్ల సంఖ్య, తల్లిదండ్రులు, విద్యార్థుల వివరాలపై సమాచారం సిద్ధం చేసుకోవాలని సూచించారు. 20 నుంచి ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రుల పేర్లకు సంబంధించిన జాబితాల్ని తయారు చేసి నోటీస్ బోర్డులో ప్రదర్శించాలి. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులుగా మండల విద్యా శాఖ పరిధిలో ఖరారు చేస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3161 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 1262 ప్రభుత్వ పాఠశాలలు, మెదక్ జిల్లాలో 923, సిద్దిపేట జిల్లాలో 976 పాఠశాలలున్నాయి. వీటికి ఎన్నికలు జరగనున్నాయి. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఓటు హక్కు కల్పిస్తారు. వీరితో పాటు కమిటీలో స్థానికంగా విద్యావంతుల నుంచి కూడా ప్రతినిధుల్ని తీసుకుంటారు.

రెండేళ్లుగా పదవీ కాలం పొడగింపు

రాష్ట్రంలో ఎస్‌ఎంసిలకు 2019 నవంబర్ 30 ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో ఎన్నికైన కమిటీల పదవి కాలం రెండేళ్లుగా పూర్తయ్యాక 2021 నవంబర్ 30లోపు అప్పటి ప్రభుత్వం ఎన్నికలు జరపలేదు. పైగా ఎస్‌ఎంసిల పదవీ కాలాన్ని పొడిగించింది. 2023 నవంబర్ 30 వరకు పొడిగించిన కాలం కూడా ముగియడంతో అప్పట్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలున్నాయని చెప్పి 2023 డిసెంబర్ 30 వరకు పదవీ కాలాన్ని మళ్లీ పొడిగించారు. ప్రస్తుత గడువు కూడా తీరడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరిపేందుకు సిద్ధమైంది.

లోపించిన ఎస్‌ఎంసిల పర్యవేక్షణ

రాష్ట్రంలో ఎస్‌ఎంసిల పదవీ కాలం ముగియడంతో పలుమార్లు పొడిగిస్తూ వచ్చారు. అయినా సరే పాఠశాల పర్యవేక్షణను పట్టించుకోలేదు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో మన ఊరు-మన బడి పేరిట కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ స్కూల్స్‌ను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారు. 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తొలి దశలో 9 వేల స్కూల్స్‌ను ఎంపిక చేసి నిధులు కేటాయించారు. ఆ పనులు పూర్తి చేయడంలో జాప్యం జరగడంతో రెండో విడత స్కూల్స్‌కు నిధులివ్వడం ఆలస్యమైంది. పనుల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలొచ్చాయి. రూ.30 లక్షల లోపు నిధులతో ఎస్‌ఎంసిలే పనులు చేశాయి. మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకం అమల్లోనూ నాణ్యతా లోపాలున్నాయి. స్కూల్స్ నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన నిధుల్ని సక్రమంగా ఖర్చు చేయడంలోనూ అవినీతి జరిగిందనే చర్చ నడిచింది.

29 వరకు ఎన్నికలు
వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా అధికారి, సంగారెడ్డి

స్కూల్ యాజమాన్య కమిటీలకు ఈ నెల 29 వరకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎస్‌ఎంసిల ఎన్నికల నిర్వహణ గురించి విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. ఆ మేరకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

బంగారు తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

- సిఎం దావోస్ పర్యటనపై ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు
- కర్రు కాల్చి వాత పెట్టినా...బుద్ధి రావడం లేదు
- కెటిఆర్, హరీశ్‌లపై మంత్రి జూపల్లి ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనపై కెటిఆర్, హరీశ్‌రావు ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా కాకముందే అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చామంటూ జూటా మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణను అప్పుల కుప్ప చేసిన రాష్ట్రాన్ని తమకు ఇచ్చారని విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడినా ఆ పార్టీ నాయకులకు ఇంకా జ్ఞానోదయం కావడం లేదన్నారు. కెసిఆర్ హయాంలో ప్రజలను మోసం చేశారు కాబట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో జనం కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నేతల అహంకార ధోరణి, కుటుంబ పాలన వల్ల ప్రజలు విసిగి, వేసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. బిఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి కూడా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి తీరుతుందని భరోసా ఇచ్చారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరతామన్నారు. ఆరు గ్యారంటీల దరఖాస్తుల డిజిటలైజ్ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరగబడుతారంటూ బిఆర్ఎస్ నాయకులు కెటిఆర్, హరీశ్‌రావు మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీ గల్లంతు అవుతుందో తేలుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావనీ, అందుకే పార్టీని బతికించుకునేందుకు బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీలో కెసిఆర్ కుటుంబం తప్ప ఒక్కరు కూడా మిగలరని హెచ్చరించారు. పదేండ్ల కెసిఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో కమీషన్ల కోసం ప్రజా ధనాన్ని దోచుకున్నారని, మిషన్ భగీరథ పథకంలో కూడా పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామనీ, ప్రతీ పైసాకు వారు లెక్క చెప్పాల్సిందేనని హెచ్చరించారు.



ఎన్‌కోర్-ఆల్కమ్ 18 అడుగుల కిటికి ప్రదర్శన

హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్‌లో శుక్రవారం ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభమైంది. ఈ షో జనవరి 21 వరకు ఇది జరుగనుంది. అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ ఎన్‌కోర్-ఆల్కమ్ ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎన్‌కోర్-ఆల్కమ్ స్టాల్‌ను కంపెనీ ఫౌండర్, సిఎండి అవుతు శివ కోటి రెడ్డి, 23 డిగ్రీస్ ఆర్కిటెక్టులు అవుతు శ్రీకాంత్ రెడ్డి, రఘురాం, ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు అవుతు పవన్ కుమార్ రెడ్డి, శ్రీ హర్ష తదితరులు ప్రారంభించారు. 1.8 టన్నుల బరువున్న 18 అడుగుల ఎత్తయిన విండోను ప్రదర్శిస్తున్నామని శివ కోటి రెడ్డి తెలిపారు. కంపెనీ తయారు చేస్తున్న విభిన్న, వినూత్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయని చెప్పారు. తమ కంపెనీకి హైదరాబాద్, గుజరాత్ లోని సూరత్ వద్ద ప్లాంట్లు ఉన్నాయన్నారు.

బిఎస్‌హెచ్ నుంచి కొత్త సిమెన్స్ బ్రాండ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : గృహోపకరణాల సంస్థ బిఎస్‌హెచ్ కొత్తగా సిమెన్స్ బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ బ్రాండ్‌లో ప్రీమియం ఉత్పత్తులను విక్రయించనున్నట్లు తెలిపింది. ఇంధన పొదుపు సామర్థ్యం, ఎఐ ఇంటిగ్రేషన్, స్మార్ట్ కనెక్టివిటీపై దృష్టి సారించామని బిఎస్‌హెచ్ హోమ్ అప్లయిన్సెస్ ఇండియా ఎండి సైఫ్ ఖాన్ పేర్కొన్నారు. వినియోగదారులను ఆకర్షించే విలక్షణమైన, ఆధునిక, అధునాతన డిజైన్లతో ఇంటిని విప్లవాత్మకంగా మార్చాలని నిర్దేశించుకున్నామన్నారు.

ఇన్నోవేషన్‌లో భారత్ ముందడుగు

- నూతన ఆవిష్కరణలకు ప్రధాని మోడీ గ్యారంటీ
- హైదరాబాద్ ఐఐటిలో ఆర్‌అండ్‌డి ఇన్నోవేషన్ ఫెస్ట్ ప్రారంభం
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్నోవేషన్‌లో భారత్ ముందడుగు వేస్తుందని, ఇన్వెంటివ్-2024 దేశంలోని ఉన్నత శ్రేణి విద్యాసంస్థలతో నిర్వహించబడుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలు మన దేశ పురోభివృద్ధికి దోహద పడతాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించబడుతున్న ఆర్‌అండ్‌డి ఇన్నోవేటివ్ ఫైర్ ఇన్వెంటివ్ 2024 రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో తెలివైన దూరదృష్టి కలిగిన ఆవిష్కరణలు అవసరమన్నారు. ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ దృష్టిని సాకారం చేయడంలో విద్య కీలక పాత్రను గుర్తించామని తెలిపారు. ట్రాన్స్ఫర్మేటివ్ ఎడ్యుకేషన్ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన అనుకూల వాదన ఐఐటీల చొరవతో సజావుగా సాగుతుందన్నారు. ఐఐటిహెచ్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు కేవలం విద్యా సంస్థలు, పరిశ్రమల సమావేశ స్థలం మాత్రమే కాదని, ఇది మన దేశ ఆర్థిక వృద్ధికి, ఉద్యోగ కల్పనకు, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత సంస్కృతిని పెంపొందించే పవర్ హౌస్ అని తెలిపారు. మన దేశం పథాన్ని రూపొందించడంలో ఐఐటీల ఆవిష్కరణలు కీలకమవుతున్నాయన్నారు. ఈ అడుగు పరివర్తనా మార్పునకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుందన్నారు. కొత్త అవకాశాలకు తలుపు తెరచి ఉజ్వలమైన, సంపన్నమైన భవిష్యత్ వైపు నడిపిస్తుందని నమ్ముతున్నామని చెప్పారు. ఇలాంటి ఇన్నోవేటివ్ కార్యక్రమాలు సమాజం, పరిశ్రమ, విద్యా సంస్థలు.. మరింత పురోగమించడానికి ఉపయోగపడతాయని తెలిపారు.



ఆర్‌అండ్‌డి ఇన్నోవేషన్ ఫెస్ట్ ప్రారంభిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరం

దేశంలోని ఉన్నత శ్రేణి విద్యాసంస్థలైన ఐఐటీల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు బాధాకరమైనవని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఐఐటిహెచ్‌లో ఇన్వెంటివ్-2024ను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడారు. దేశంతో పాటు ఐఐటి హైదరాబాద్‌లో ప్రతి ఏటా పలువురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. సమాజంలో ఎవరు ఆత్మహత్య చేసుకున్నా అది తప్పేనని తెలిపారు. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ ఇచ్చేందుకు విద్యా సంస్థల్లో కమిటీలు వేశామన్నారు. కార్యక్రమంలో ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, ప్రొఫెసర్లు సుభాసిస్ చౌధురి, బి రవి, డైరెక్టర్ సూరత్కల్, డాక్టర్ ప్రశాంత్ గార్గ్, ఎల్‌వి ప్రసాద్, రాజీవ్ అహుజా, రోపర్, డాక్టర్ శ్రీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వోల్వో బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రయివేట్ ట్రావెల్ బస్సు ముందు టైరు ఊడి పోయింది. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కేంద్రంలోని సబ్ స్టేషన్ ముందు జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఎమ్మార్ ట్రావెల్స్ ఓల్వో బస్సు బెంగళూరు నుంచి హైదరాబాదుకు వస్తోంది. అందులో ఇద్దరు డ్రైవర్లు, ప్రయాణికులున్నారు. తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు అడ్డాకులకు రాగానే 44 జాతీయ రహదారిపై బస్సు ముందు భాగంలోని టైర్ ఊడి పోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును పక్కకు తీయడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు కె యశోద అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యం నిరుద్యోగ వికలాంగుల పాలిట శాపంగా మారుతుందన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల అధికారులు, వికలాంగుల సంఘాలతో కోఆర్డినేషన్ కమిటీ వేయాలని కోరారు. ప్రతి వికలాంగునికి అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నా ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, షాపింగ్ కంప్లెక్స్‌ల్లో ర్యాంపులు నిర్మించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వికలాంగులను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బస్వారాజు, ఉపాధ్యక్షులు దుర్గ, ఆగమయ్య, గౌతమ్, స్వరూప, యాదగిరి, కిష్టయ్య, చంద్రమ్మ, సహాయ కార్యదర్శులు ఎల్లమ్మ, శ్రీనివాస్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ ఎవర్ని నిలబెట్టినా ఓకే...

- మెదక్ ఎంపి స్థానం నాలుగోసారి కైవసం చేసుకుంటాం
- ఎమ్మెల్యే సునీతా లక్ష్మా రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ పార్లమెంటు స్థానానికి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎవరినీ అభ్యర్థిగా నిర్ణయించినా నాలుగోసారి కైవసం చేసుకుంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మెదక్ పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ .పార్లమెంటు నియోజక వర్గ పరిధి మొత్తం ఏడు నియోజకవర్గాలకుగానూ ఆరు అసెంబ్లీ సీట్లు గెలిచామని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంటు ఎన్నికల్లోనూ కష్టపడి పని చేస్తామని కార్యకర్తలు భరోసా ఇచ్చారని తెలిపారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నదనీ, అలాంటి వారికి అగ్రనేతలు అండగా ఉంటారని తెలిపారు.

ఓడిన కాంగ్రెస్ అభ్యర్థులు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు. ప్రోటోకాల్ సమస్యలు రాకుండా అధికారులు వ్యవహరించాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఇన్‌ఛార్జుల వ్యవస్థను తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నదని విమర్శించారు.

బాలికపై కత్తితో బాలుని దాడి

అనంతరం రైలు కింద పడి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అంబర్‌పేటలో దారుణ ఘటన జరిగింది. తనను ప్రేమించడం లేదన్న కోపంతో బాలికపై ఓ బాలుడు కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన ఓ యువతికీ గాయాలయ్యాయి. అనంతరం అతను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట పిఎస్ పరిధిలో నివాసం ఉండే బాలుడు, బాలిక పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ప్రస్తుతం వారు వేర్వేరు కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి చదువుతున్నారు. అయితే, బాలుడు కొద్ది కాలంగా తనను ప్రేమించాలని బాలికను వేధిస్తున్నాడు. అమ్మాయి మాత్రం అతన్ని దూరం పెడుతోంది. ఇదిలా ఉండగా ఆ బాలుడు గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో అమ్మాయి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే ఉన్న కూరగాయలు కోసే కత్తితో బాలికపై దాడి చేశాడు. అతన్ని అడ్డుకునేందుకు యత్నించిన బాలిక సోదరికి కూడా గాయాలయ్యాయి. అనంతరం భయంతో బాలుడు.. తాను చనిపోతున్నానని స్నేహితులకు మెసేజ్ చేశాడు. జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సు, డీజిల్ ట్యాంకర్ ఢీ

- పది మందికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎదురెదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు, డీజిల్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటన హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల జెర్రిపోతుల వాగు వద్ద శుక్రవారం జరిగింది. ఈ ఘటనలో బస్సులోని పదిమందికి గాయలయ్యాయి. స్థానిక సిఐ రవిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు నుంచి హన్మకొండకు వస్తున్న ఆర్‌టిసి వరంగల్ -2 డిపోకు చెందిన బస్సును హన్మకొండ నుండి ములుగు వైపు అతివేగంగా వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్‌టిసి డ్రైవర్ ముందు అద్దం పూర్తిగా ధ్వంసమైంది. బస్సులో ప్రయాణిస్తున్న పది మందికి స్వల్ప గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం 108లో వెంటనే ఎంజిఎం ఆస్పత్రికి తరలించినట్టు సిఐ తెలిపారు. కాగా డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ రామచంద్ర ప్రశాంత్.. లారీని అతివేగంగా నడపడంతో రోడ్డు పక్కన బోల్తా పడింది. ట్యాంకు మొత్తం డీజిల్‌తో నిండి ఉండటంతో విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది.. మంటలు చెలరేగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్‌టిసి బస్ కండక్టర్ దొడ్డ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో విజిలెన్స్ తనిఖీలు

- చెల్లింపులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి సూపర్ క్రిటికల్ అల్ట్రా థర్మల్ విద్యుత్‌కేంద్రంలో రాష్ట్ర విజిలెన్స్ తనిఖీలు నిర్వహించింది. ప్లాంటు నిర్మాణం, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు, టెండర్ల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఇటీవల శాసనసభలో సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించిన నేపథ్యంలో.. ప్లాంటులోని పలు కీలక పత్రాలను రాష్ట్ర విజిలెన్స్ శాఖకు సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్లాంటు నిర్మాణ సమయం నుంచి జరిగిన భూ సేకరణ, నిధుల కేటాయింపు, వ్యయాలకు సంబంధించిన దస్త్రాలు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నట్లు తెలిసింది. సిఎం దావోస్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన తర్వాత విజిలెన్స్ శాఖ దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను సిఎంకు సమర్పించనుంది. ఆతర్వాత పూర్తిస్థాయి తనిఖీలు జరిగే అవకాశం ఉంది. కృష్ణా పరీవాహక ప్రాంతమైన వీర్లపాలెంలో విద్యుత్ కేంద్ర నిర్మాణానికి 2015 జూన్ 8న అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ భూమిపూజ చేశారు. తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.28వేల కోట్ల అంచనా వ్యయంతో 2017లో నిర్మాణాన్ని ప్రారంభించారు. నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రస్తుతం ఈ వ్యయం రూ.55వేల కోట్ల వరకు పెరిగింది. ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, బొగ్గు, బూడిద నిల్వలు, రిజర్వాయర్, ఇతర ప్లాంటు అవసరాల నిమిత్తం ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 4,200 ఎకరాలను కేటాయించింది. ఇందులో ప్రభుత్వ, అటవీ, పట్టా భూములున్నాయి. అటవీ భూములకు బదులుగా మరోచోట భూములను కేటాయించారు. పట్టా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరాకు గరిష్ఠంగా రూ.6.5 లక్షలను పరిహారంగా నిర్ణయించారు. ఈ పరిహారం చెల్లింపులలో భారీగా అక్రమాలు జరిగినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. భూములు కోల్పోని స్థానిక గిరిజనుల పేర్లతో పరిహారాన్ని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పంచుకున్నారని నిర్వాసితులు ఆరోపించారు. ప్లాంటు ప్రధాన పనులను బిహెచ్ఇఎల్ (భెల్)కు అప్పగించగా ఇప్పటి వరకు 50 శాతమే పూర్తయి నట్లు తెలుస్తోంది. అంచనా వ్యయంలో 80 శాతం నిధులు వెచ్చించినట్లు సమాచారం. చేసిన ఖర్చుపై జెన్‌కో అధికారులు మొదటి నుంచి గోప్యత పాటిస్తున్నారు. 2015 నుంచి 2023 వరకు నిర్వాసితులకు రూ.100 కోట్ల మేర చెల్లించి నట్లు సమాచారం. ఈ చెల్లింపులపై కూడా అధికారుల నుంచి స్పష్టత కరవైంది. దీంతో విజిలెన్స్ వారు భూ పరిహారం విభాగం వ్యవహారాలు చూసిన మిర్యాలగూడ డివిజన్‌లోని రెవెన్యూ వారిని, జెన్‌కోలోని సంబంధిత అధికారులను విచారించే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు విద్యుత్ బాయిలర్ల నిర్మాణం, ఇతర పనుల కోసం సుమారు రూ.20 వేల కోట్ల విలువైన టెండర్లు తమకు అనుకూలమైన సంస్థలకే దక్కే విధంగా జెన్‌కోలోని కీలక అధికారులు వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా విజిలెన్స్ బృందం సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది.

బిఆర్ఎస్‌లో ఎడముఖం.. పెడముఖం

- 'కడియం', 'పల్లా'ల వైఖరితో.. పార్టీ శ్రేణుల్లో అయోమయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గెలిచిన ఇద్దరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య సయోధ్య లేకపోవడంతో పార్టీలో గందరగోళం నెలకొంది. జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎడముఖం, పెడముఖంగా ఎవరి దారి వారిదే అన్నట్టుగా ఉండటంతో పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నారు. అంతేకాదు, బిఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షులు, జడ్‌పి చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతి అనంతరం జిల్లాలో పార్టీని సమన్వ యంతో నడిపించడానకి ఎవరూ ఆసక్తిని ప్రదర్శించకపోవడం గమనార్హం. జనగామ నియోజకవర్గంలో ఇటీవల అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ రగడతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కొమురవెల్లి జాతర సన్నాహక సమావేశం నుంచి వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై 'కడియం' స్పందించక పోవడంతో వీరిద్దరి మధ్య విభేధాలున్నాయన్న చర్చ నడుస్తోంది. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో తనకు టికెట్ రాకుండా 'పల్లా' అడ్డుకున్నారని 'కడియం' భావిస్తున్నారు. దాంతో ఇద్దరి మధ్య విభేధాలు తారస్థాయికి చేరినట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి, జనగామలో బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఇందులో రాజకీయంగా 'కడియం', 'పల్లా' కంటే సీనియర్ రాజకీయ నేత కావడం గమనార్హం. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికే చెందిన 'పల్లా' గతంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు మద్దతిచ్చి 'కడియం'ను వ్యతిరేకించడంతో వీరిద్దరి మధ్య విభేదాలు భయటపడ్డాయి. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వంలో కడియం శ్రీహరి.. డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో 'పల్లా' ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజు రీయంబర్స్‌మెంట్ చేయకపోవడంపై స్పందించడమూ వీరిద్దరి మధ్య విభేదాలకు కారణంగా చెబు తున్నారు. ఒకవైపు రాష్ట్రంలో అధికారం కోల్పోయి తీవ్ర నిరాశలో వున్న బిఆర్ఎస్ శ్రేణులు, ఇద్దరు ఎమ్మెల్యే వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిద్దరూ జనగామ జిల్లాకు చెందిన వారైనా నేటి వరకు జిల్లాలో పార్టీ శ్రేణులను సమన్వయంతో నడిపించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

ప్రోటోకాల్ రగడపై స్పందించని 'కడియం'

జనగామ నియోజకవర్గంలో కొమురవెల్లి జాతర సన్నాహక సమావేశంలో ప్రోటోకాల్ రగడ నేపథ్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చిన విషయం విదితమే. అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో వాగ్వివాదానికి దిగిన 'పల్లా' ఎట్టకేలకు చేసేదేమీ లేక సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. ఈ అధికారిక సమావేశంలో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అనుమతించడంపై 'పల్లా' తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారినా, దీనిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించకపోవడం ఈ ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఉన్న విభేధాలే కారణంగా పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గెలిచిన ఇద్దరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలది తలోదారి కావడంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికలను ఎలా ఎదుర్కొంటామని సగటు బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.